ఘనంగా తిరంగా ర్యాలీ

- ఓల్డ్‌బోయిన్‌పల్లిలో 400 మీటర్ల పొడవు జాతీయ జెండా ప్రదర్శన
- హాజరైన ఎమ్మెల్యే కృష్ణారావు, కార్పొరేటర్లు, బీఆర్ఎస్ శ్రేణులు, 1200 మంది విద్యార్థులు

బాలానగర్, ఆగస్టు 14: ఓల్డ్‌బోయిన్‌పల్లి డివిజన్‌లో తిరంగా ర్యాలీ అంగరంగ వైభవంగా జరిగింది. బుధవారం మక్తల్ ఫౌండేషన్, మల్లేశ్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన తిరంగా ర్యాలీకి కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, డివిజన్ కార్పొరేటర్ ముద్దం నర్సింహ యాదవ్, బాలానగర్ కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి హాజరయ్యారు. ఈసందర్భంగా 12 మంది విద్యార్థులు 400 మీటర్ల పొడవైన తిరంగా జెండా పట్టుకొని వివిధ దేశభక్తి గీతాలాపనలతో హస్మత్‌పేట చౌరస్తా నుంచి వార్డు కార్యాలయ ప్రాంగణం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. జాతీయ గీతాలాపనలతో ఓల్డ్‌బోయిన్‌పల్లి పులకించిపోయింది. వీధివీధిన జాతీయ గీతాలతో మార్మోగడంతో సందడి వాతావరణం నెలకొన్నది.ఈసందర్భంగా ఎమ్మెల్యే కృష్ణారావు మాట్లాడుతూ.. తిరంగా ర్యాలీలో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. తిరంగా అంటే జాతీయత అని అర్థం అన్నారు. జెండా పట్టుకొని ర్యాలీలో పాల్గొంటే జాతీయత ఉట్టిపడుతుందన్నారు. జాతీయతా భావం ప్రతిఒక్కరిలోనూ వచ్చినప్పుడే దేశం మనుగడ సగర్వంగా ఉంటుందన్నారు.కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కర్రె జంగయ్య, మక్కల నర్సింగ్, సయ్యద్ ఎజాజ్, ఇర్ఫాన్, మన్నె ఉదయ్, హరినాథ్, మట్టి శ్రీను, బుర్రి యాదగిరి, మిరాజ్, లలిత, ఉదయరాణి, అనురాధ, స్వరూప బీఆర్ఎస్ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఓల్డ్‌బోయిన్‌పల్లి డివిజన్‌లో తిరంగా ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే కృష్ణారావు, కార్పొరేటర్ నర్సింహ యాదవ్ తదితరులు

పేదలకు వరం సీఎం రిలీఫ్ ఫండ్

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

కేపీహెచ్‌బీ కాలనీ, ఆగస్టు 14: సీఎం రిలీఫ్‌ఫండ్ పేదలకు వరంలాంటిదని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 30మందికి రూ.10,19,500 విలువజేసే సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అనారోగ్యంతో వైద్యశాలలో చేరిన పేదలకు సీఎం రిలీఫ్‌ఫండ్ అండగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో స్థానిక బీఆర్ఎస్ పార్టీ నేతలు ఉన్నారు.

ఆర్థిక సాయం అందజేత

బాలానగర్, ఆగస్టు 14: బాలానగర్ డివిజన్ పరిధి శ్రీశ్రీ నగర్‌లోని కిరాణ దుకాణంలో విద్యుదాఘాతంతో అగ్నిప్రమాదం జరిగి షాపు దగ్ధం అయ్యింది. దీంతో ఆధారం కోల్పోయిన బాధిత కుటుంబానికి కూకట్‌పల్లి కృష్ణారావు ఆదుకున్నారు. బుధవారం శ్రీశ్రీనగర్‌లోని అగ్నిప్రమాద బాధిత కుటుంబాన్ని డివిజన్ కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డితో కలిసి వెళ్లి రూ.10వేలు ఆర్థిక సాయం అందజేశారు.

కూకట్‌పల్లి జోన్‌లో 4 బిల్డింగ్స్ సీజ్

జడ్సీ అపూర్వ చౌహాన్

కూకట్‌పల్లి జోన్‌లో అక్రమ నిర్మాణాలను సీజ్ చేస్తున్న జీహెచ్ఎంసీ అధికారులు

కేపీహెచ్‌బీ కాలనీ, ఆగస్టు 14:కూకట్‌పల్లి జోన్ పరిధిలో నాలుగు అక్రమ నిర్మాణాలను సీజ్ చేశామని, జీహెచ్ఎంసీ నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడితే చట్టరీత్యా చర్యలు తప్పవని జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్ హెచ్చరించారు. బుధవారం మూసాపేట సర్కిల్ పరిధిలోని కేపీహెచ్‌బీ కాలనీ 5వ రోడ్డులోని ఎల్ఐజీ 718, కాలనీ 15వ ఫేజ్‌లోని ఎల్ఐజీ 81, కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలోని వెంకట్‌రావునగర్‌లోని(ఇంటి నంబర్ 5-3-326/2/6)లోని నిర్మాణం, అల్వాల్ సర్కిల్‌లోని రామ్‌నగర్(ఇంటి నంబర్ 1-17-15/27) నిర్మాణాలను సీజ్ చేశారు. అలాగే.. మూసాపేట సర్కిల్‌లోని కేపీహెచ్‌బీ కాలనీ 15వ ఫేజ్‌లోని ఎంఐజీ 148, కూకట్‌పల్లి సర్కిల్‌లోని వివేకానందనగర్‌లోని ప్లాట్ నంబర్ 98, కుత్బుల్లాపూర్ సర్కిల్‌లోని పద్మానగర్ ప్లాట్ నంబర్ 525, గాజులరామారం సర్కిల్‌లోని మహాదేవపురంలోని ప్లాట్ నంబర్ టీ-55, అల్వాల్ సర్కిల్‌లోని ఓల్డ్ అల్వాల్‌లోని (ఇంటి నంబర్ 1-4-162/8)లోని నిర్మాణాన్ని కూల్చివేయడం జరిగిందన్నారు. జీహెచ్ఎంసీ నిబంధనలు పాటిస్తూ నిర్మాణాలు చేపట్టాలని, అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

విద్యార్థులకు నోట్‌పుస్తకాలు పంపిణీ

అల్లాపూర్, ఆగస్టు 14 : కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు తన సొంత నిధులతో నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ప్రతియేట స్కూల్ బ్యాగులు, నోట్‌పుస్తకాలు, పెన్సిళ్లు, పెన్నులతో కూడిన కిట్లను పంపిణీ చేస్తున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం స్థానిక కార్పొరేటర్ సబీహా బేగం అల్లాపూర్ డివిజన్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఎమ్మెల్యే అందిస్తున్న స్కూల్ బ్యాగుల కిట్లను విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులను ప్రోత్సాహాన్ని అందించాలనే ఉద్దేశంతో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ప్రతియేట ఈ కిట్లను అందజేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు లింగాల ఐలయ్య, వీరారెడ్డి, నాగుల సత్యం, వెంకటేశ్, జ్ఞానేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బ్యాగులు అందజేస్తున్న కార్పొరేటర్ సబీహాబేగం

పరిసరాల పరిశుభ్రతతో దోమల నివారణ

ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని పరికి చెరువు పరిసర ప్రాంతాల్లో దోమల నివారణకు ఎంటమాలజీ ఆధ్వర్యంలో ఎంఎల్‌వో ఆయిల్ బాల్స్‌ను కార్పొరేటర్ వెంకటేశ్ బుధవారం చెరువులో విసిరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నివాస ఆవాస ప్రాంతాలు పరిశుభ్రంగా నిర్వహించుకోవాలని, తద్వారా దోమల వ్యాప్తిని అరికట్టవచ్చునన్నారు. మురుగు నీరు, వ్యర్థాలు పేరుకుంటే దోమలతోపాటు అనారోగ్యాలు దరి చేరుతాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండి తగు స్వీయ చర్యలను తీసుకోవాలన్నారు. జీహెచ్ఎంసీ పరంగా దోమల నివారణకు తగు జాగ్రత్త చర్యలు చేపడుతున్నట్లు కార్పొరేటర్ పేర్కొన్నారు. పార్టీ నేతలు, సిబ్బంది పాల్గొన్నారు. *– మియాపూర్, ఆగస్టు 14*

కూకట్‌పల్లి రైతుబజార్‌లో కూరగాయల ధరలు

కేపీహెచ్‌బీ కాలనీ, ఆగస్టు 14 : కూకట్‌పల్లి (కేపీహెచ్‌బీ కాలనీ) రైతుబజార్‌లో బుధవారం కూరగాయల ధరలు (కేజీ-రూపాయలు) కింది విధంగా ఉన్నాయి.టమాట 21, వంకాయ 40, బెండకాయ 23, పచ్చిమిర్చి 50, బజ్జి మిర్చి 60, కాకరకాయ 32, బీరకాయ 28, క్యాబేజి 23, ఫ్రెంచ్ బీన్స్ 50, క్యారెట్ 40, కాలీఫ్లవర్ 23, దొండ 30, చిక్కుడు 55, గోరుచిక్కుడు 28, బీట్‌రూట్ 28, క్యాప్సికం 50, ఆలుగడ్డ 37, కీరా 23, దోసకాయ 15, సొరకాయ 11, పొట్లకాయ (1) 15, కందగడ్డ 45, ఉల్లిపొరక 35 , ఉల్లిగడ్డ 44, మామిడికాయ(1) 15 నుంచి 20, అరటికాయ(1) 8 నుంచి 10, చామగడ్డ 40, ముళ్లంగి (1) 4 నుంచి 5, మొరంగడ్డ 55, గుమ్మడికాయ 30, నిమ్మకాయలు(12) 40 నుంచి 50, మునగకాయ(1) 6 నుంచి 8, పొప్పడికాయ 40, పుట్టగొడుగులు (200గ్రా.) 40, ఎండుమిర్చి 220, అల్లం 200, వెల్లుల్లి 280, చింతపండు 140, కరివేపాకు 60గా ఉన్నాయి. ఈ ధరలు నేటి ఉదయం 9.30 గంటల వరకు రైతుబజార్‌లో అమలులో ఉంటాయని ఎస్టేట్ ఆఫీసర్ సుధాకర్ తెలిపారు.

బీఈ పరీక్ష తేదీల ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ, ఆగస్టు 14: ఓయూ పరిధిలోని బీఈ కోర్సుల పరీక్ష తేదీలను ఖరారు చేసినట్లు కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు తెలిపారు. బీఈ (ఏఐసీటీఈ) అన్ని విభాగాల రెండు, నాలుగు, ఆరో సెమిస్టర్ మెయిన్, అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్, బీఈ (సీబీసీఎస్) అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్, బీఈ (నాన్ సీబీసీఎస్) అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్, వన్ టైం చాన్స్ పరీక్షలను ఈనెల 28 నుంచి నిర్వహించనున్నట్లు చెప్పారు. పూర్తి వివరాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.in లో చూసుకోవచ్చని సూచించారు.

ఎల్ఆర్ఎస్ దరఖాస్తులపై దృష్టి పెట్టాలి

మేడ్చల్ కలెక్టరేట్, ఆగస్టు 14: ఎల్ఆర్ఎస్ దరఖాస్తులపై దృష్టి పెట్టాలని అదనపు కలెక్టర్‌రాధికాగుప్తా అన్నారు. కలెక్టరేట్‌లో బుధవారం ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలనపై ఓరియంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పట్టణ స్థానిక సంస్థలు(యుఎల్‌బీలు), గ్రామ పంచాయతీల్లో ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలనపై దృష్టి పెట్టాలని అదనపు కలెక్టర్ అధికారులకు సూచించారు.

సమన్వయ లోపం.. ప్రజలకు శాపం

- ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ
- పారిశుధ్యం, వ్యర్థాల తొలగింపుపై అసంతృప్తి

మియాపూర్, ఆగస్టు 14: పారిశుధ్య నిర్వహణ వ్యర్థాల తొలగింపు విషయంలో జీహెచ్ఎంసీ, రాంకీ సంస్థ ప్రతినిధుల మధ్య సమన్వయ లోపం కారణంగా వ్యర్థాలు పేరుకుపోయి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. వ్యర్థాలు నాలాలు, డ్రెయిన్లలో చేరి ముంపు సమస్యలకు దారి తీస్తున్నాయన్నారు. ఆయా విభాగాలు సమన్వయ సమస్యను అధిగమించి పరస్పరం కలిసి పని చేసి ప్రజలకు అసౌకర్యం కలుగకుండా చూడాలని పారిశుధ్యాన్ని మరింతగా మెరుగుపరచాలని ఎమ్మెల్యే గాంధీ పేర్కొన్నారు. నియోజకవర్గంలో పారిశుధ్య నిర్వహణ భవన వ్యర్థాల తరలింపుపై రాంకీ సంస్థ ప్రతినిధులతో ఎమ్మెల్యే బుధవారం తన నివాసంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పారిశుధ్య పనుల నిర్వహణపై అలసత్వం ఏ మాత్రం పనికిరాదని, తాము సహించబోమని స్పష్టం చేశారు. కాలనీల్లో పేరుకుపోతున్న చెత్తకుప్పల తొలగింపులో రాంకీ, జీహెచ్ఎంసీ నడుమ సమన్వయ లోపం క్షేత్రస్థాయిలో స్పష్టంగా కనిపిస్తున్నదన్నారు. వ్యర్థాల తొలగింపులో రాంకీకి తగు అనుభవం లేకపోవడం, సరైన రవాణా వ్యవస్థను ఏర్పాటు చేసుకోకపోవడం వల్ల ఐటీ ప్రాంతమైన శేరిలింగంపల్లి నియోజకవర్గంలో సింహభాగం ప్రాంతాలు అపరిశుభ్రంగా మారాయని ఎమ్మెల్యే గాంధీ అన్నారు. కాలనీలు, బస్తీలు, అంతర్గత ప్రధాన రహదారులపై చెత్త కుప్పలను ఎప్పటికప్పుడు తొలగించాలని, నిర్మాణ వ్యర్థాల తరలింపులో జాప్యం లేకుండా చూడాలని, ట్రాక్టర్ డ్రైవర్ల సమస్యలను పరిష్కరించి వారిని తగు న్యాయం చేయాలని ఎమ్మెల్యే సూచించారు. అంటు వ్యాధులు ప్రబలకుండా ఉండేలా స్వచ్ఛ పరిసరాల సాధనకు సమన్వయంతో కృషి చేయాలని, అధికారులు తగు పర్యవేక్షణ చేపట్టాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాంకీ ప్రతినిధులు హరికృష్ణ, సత్య, భూపాల్‌రెడ్డి, సుధాకర్, కాంగ్రెస్ నేత శ్రీనివాస్ పాల్గొన్నారు.

– శేరిలింగంపల్లి నియోజకవర్గంలో విద్యుత్ సమస్యల పరిష్కారంతో పాటు మెరుగైన సరఫరాకు తీసుకోవాల్సిన చర్యలపై విద్యుత్ శాఖ అధికారులతో ఎమ్మెల్యే గాంధీ బుధవారం తన నివాసంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుకు కావాల్సిన స్థలాలను ఇప్పించేందుకు సీఎం సహా జిల్లా కలెక్టర్‌కు విన్నవిస్తామని, ఇందుకు సంబంధించిన తగు ప్రతిపాదలను సమర్పించాలని సూచించారు. విద్యుత్ అంశాలపై ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై తక్షణమే స్పందించి సత్వర చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఈ వెంకన్న, డీఈలు రవికుమార్, గర్మంతరెడ్డి, ఏడీఈలు కమలాకర్‌రెడ్డి, శ్యామ్ ప్రసాద్, ఏఈలు వెంకటరమణారెడ్డి,శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.

– స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే గాంధీ శుభాకాంక్షలు తెలిపారు. ఎందరో అమరుల త్యాగం ఫలితంగా స్వాతంత్ర్య ఫలాలను అనుభవిస్తున్నామన్నారు. నియోజకవర్గంలో ప్రతి ఇంటా జాతీయ పతాకాన్ని ఎగురవేసి స్వతంత్ర భారత కీర్తిని నలుదిశలా చాటాలని ఎమ్మెల్యే గాంధీ పిలుపునిచ్చారు.



రాంకీ ప్రతినిధులు, వ్యర్థాల తొలగింపు ట్రాక్టర్ల సంస్థ ప్రతినిధులు, డ్రైవర్లతో ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

చందానగర్‌లో బీవోబీ ఫిజిటల్ బ్రాంచ్

బ్యాంక్ ఆఫ్ బరోడా హైదరాబాద్ నగరంలో తొలి ఫిజిటల్ బ్రాంచ్‌ను ప్రారంభించింది. స్వీయ సేవ, సహాయక బ్యాంకింగ్ సేవలను అందించేలా ఫిజిటల్ బ్రాంచ్‌ను బుధవారం ఆవిష్కరించగా.. బీవోబీ ఈడీ సంజయ్ వినాయక్ ముదిలియార్, జనరల్ మేనేజర్ రితేశ్‌కుమార్ ముఖ్యఅతిథులుగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఈడీ సంజయ్ వినాయక్ మాట్లాడుతూ.. దేశంలోనే తొలి ఫిజిటల్ బ్యాంక్‌ను హైదరాబాద్‌లో ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. దేశవ్యాప్తంగా పైలట్ ప్రాజెక్టుగా 7 ఫిజిటల్ శాఖలను ప్రారంభించాలని బీవోబీ లక్ష్యంగా పెట్టుకుందని తెలిపారు. *– సిటీబ్యూరో, ఆగస్టు 14(నమస్తే తెలంగాణ)*

హెచ్‌సీయూలోని అస్పైర్ - బయోనెస్ట్‌లో ప్యానెల్ డిస్కషన్

సమావేశంలో పాల్గొన్న ప్రముఖులు

కొండాపూర్, ఆగస్టు 14: గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలోని అస్పైర్-బయోనెస్ట్ ఇంక్యూబేటర్, మిరాకిల్ మీ, ఐకేపీ హైదరాబాద్ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం వర్సిటీలోని స్కూల్ ఆఫ్ లైఫ్ సైన్సెస్‌లో 'మై ప్లేట్ ఫర్ ది డే : రియల్ ఇన్‌సైట్స్ ఇంటూ ది డైటెరీ గైడ్‌లైన్స్ బై ఐసీఎంఆర్, ఎన్ఐఎన్'పై ప్యానెల్ డిస్కషన్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అస్పైర్-బయోనెస్ట్ ఇంక్యూబేషన్ మేనేజర్ డాక్టర్ హర్షిత అధ్యక్షత వహించగా, బీఐఆర్ఏసీ సీనియర్ ప్రోగ్రామ్ ఆఫీసర్ మితిక కశ్యప్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. నేటి ప్రపంచం ఎదుర్కొంటున్న బలవర్ధక ఆహారం, పోషక విలువలపై పలువురు ప్రముఖులు చర్చించారు. భవిష్యత్తు తరాలకు మేలు జరిగేలా తీసుకోవాల్సిన, అభివృద్ధి చేయాల్సిన ఆహార సూత్రాలపై తమ విలువైన సలహాలు, సూచనలను పంచుకున్నారు.

నేరాలు తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలి

మేడ్చల్ డీసీపీ ఎన్.కోటిరెడ్డి

కుత్బుల్లాపూర్,ఆగస్టు14:నేరాల నియంత్రకు తగు చర్యలు తీసుకొని శాంతియుతమైన వాతావరణం తీసుకురావాలని మేడ్చల్ జోన్ డీసీపీ ఎన్.కోటిరెడ్డి అన్నారు. బుధవారం మేడ్చల్ డీసీపీ పరిధిలోని ఏసీపీలు, సీఐలు, ఎస్ఐలతోపాటు టెక్నికల్ సిబ్బందికి పాలనకు సంబంధించిన అంశాలపై చర్చించారు. అనంతరం ఆయా పోలీస్ స్టేషన్ పరిధిలో దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న కేసులపై చర్చించారు. కార్యక్రమంలో ఏసీపీలు, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

బండి రమేశ్.. నీ గత చరిత్ర మరిచావా?

బీఆర్ఎస్ పార్టీ నేతల ఫైర్

కేపీహెచ్‌బీ కాలనీ, ఆగస్టు 14: పేదలు, కార్మికులు, అమాయక ప్రజలను వంచించి.. అందిన కాడికి దండుకొని, అరకొర నిర్మాణాలతో అడ్డగోలుగా సంపాదించిన డబ్బులతో, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ టికెట్ కొనుక్కొని ఓటమిపాలైన బండి రమేశ్.. నీవా మాకు నీతులు చెప్పేదని కేపీహెచ్‌బీ కాలనీ, బాలాజీనగర్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ నేతలు ధ్వజమెత్తారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంలో ఆల్విన్ ఎంప్లాయిస్‌ను నిట్టనిలువుగా మోసం చేసిన నీవు కూకట్‌పల్లికి వచ్చి నీతులు చెబితే నమ్మెవారు లేరని, కూకట్‌పల్లిలో నిజమైన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలను పక్కనపెట్టి, పారాషూట్ నాయకులు, వసూలు రాజాలను వెంటేసుకుని, రోజువారి చిరువ్యాపారం చేసుకునే పేదల దుకాణాలకు వెళ్లి. వారికి ఎంత ఇస్తున్నావు.. వీరికి ఎంత ఇస్తున్నావు.. నాకు ఎంత ఇస్తావు అని అడుకుంటున్న నీవా నీతులు చెప్పేదని విమర్శించారు. కేపీహెచ్‌బీ కాలనీలోని ఎంఆర్‌వో, రైతుబజార్‌ల వద్ద 30 ఏండ్లుగా పూలు, పండ్లు అమ్ముకుని జీవిస్తున్న చిరువ్యాపారులను భయభ్రాంతులకు గురిచేసి రోడ్డున పడేశావన్నారు. చేపల మార్కెట్‌లో రెండుసార్లు టెండర్లు పిలిచారని, స్థానికంగా కొందరు బడుగు,బలహీన వర్గాలకు చెందిన వాళ్లు నిబంధనల ప్రకారం నెలవారి అద్దెలను చెల్లించేలా షాపులు కేటాయించారని, అందులో కొందరు షాపులను స్వయంగా నిర్వహించుకోగా.. మరికొందరు అద్దెలకు ఇచ్చుకున్నారని.. ఈవిషయం రాద్ధాంతం చేయడం విడ్డూరంగా ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ నేతలను తీసుకుని ఫిష్ మార్కెట్‌కు వెళ్లి.. చిరువ్యాపారులను రోడ్డున పడేస్తానని, భయభ్రాంతులకు గురి చేయడం సరికాదన్నారు. చిరు వ్యాపారులను లక్ష్యంగా చేసుకుని సాగిస్తున్న నీ రాజకీయ డ్రామాకు తెరదించాలని, లేకుంటే చిరువ్యాపారుల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నేతలు పవన్‌కుమార్, వెంకటేశ్‌చౌదరి, శరత్‌కుమార్, రాధేశ్యాం, నాగేశ్వర్‌రావు, సత్యప్రకాశ్, అనిల్‌కుమార్, లక్ష్మణ్, పాతూరి గోపి, సాయిశ్రీనివాస్, రాజేశ్‌రాయ్, నాని, దినేశ్‌నాయుడు, రావేల్‌షా, మోజేశ్, రవీందర్‌రెడ్డి, పృథ్వీరాజ్, రమేశ్, సురేశ్‌కుమార్, దేవరాజ్‌లు ఉన్నారు.

కేపీహెచ్‌బీ కాలనీలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ పార్టీ నేతలు

తండాకు రోడ్డు నిర్మించాలని రోడ్డెక్కారు..

దుండిగల్, ఆగస్టు 14: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని దుండిగల్ తండా-2లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలంటూ పలువురు బంజారాలు బుధవారం రోడ్డెక్కారు. తమ ప్రధాన సమస్య అయిన అంతర్గత రోడ్డు వేయమని ప్రభుత్వాలకు విన్నవించినా పట్టించుకోవడంలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తూ పలువురు యువకులు పెద్దఎత్తున రోడ్లపై వచ్చి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమ తండాలో రోడ్డు లేకపోవడంతో తీవ్రఇబ్బందులు పడుతున్నామని, తమ గ్రామంలోని రోడ్డు మీదనుండే వందలాది ఫార్మా కంపెనీ బస్సులు, నీళ్ల ట్యాంకర్లు, పారిశ్రామిక వాహనాలు ప్రతిరోజు రాకపోకలు జరుతున్నాయని తెలిపారు. అయినప్పటికీ రోడ్డు మరమ్మతు పనులు గాని, నూతన రోడ్డు నిర్మాణం కానీ చేయకపోవడంతో ఆందోళన వ్యక్తం చేస్తూ రోడ్డుపై బైఠాయించారు. దీంతో కాజిపల్లి ఫార్మాసిటీకి వెళ్లాల్సిన బస్సులు, ఉద్యోగాలకు వెళ్తున్న వాహనాలు నిలిచిపోయి పెద్దఎత్తున ట్రాఫిక్ స్తంభించింది. విషయం తెలుసుకున్న దుండిగల్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ఆందోళనకారులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. తమ తండాలో మౌలిక వసతులు కరువయ్యాయని బంజారా సోదరులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రోడ్డు పనులు చేపట్టాలని, లేని పక్షంలో భవిష్యత్‌లో మరింత ఆందోళన చేపడుడతామని హెచ్చరించారు.

దుండిగల్ తండా-2లో బంజారాల ఆందోళనతో రోడ్డుపై నిలిచినపోయిన వాహనాలు

వివిధ కోర్సుల ఫలితాల విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ, ఆగస్టు 14: ఓయూ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. బీఈడీ (స్పెషల్ ఎడ్యుకేషన్) ఎంఆర్ఐ, ఎల్‌డీ, హెచ్ఐ, ఏఎస్‌డీ కోర్సులతో పాటు పీజీడీసీఏ పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు చెప్పారు. ఫలితాలను ఓయూ వెబ్‌సైట్ www. osmania.ac.inలో అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు.

పీఆర్టీయూటీఎస్ బాచుపల్లి మండల నూతన కార్యవర్గం ఎన్నిక

అధ్యక్షుడు నర్సింహులు